వరద నీటిలోనే గ్రామాలు

- బుడమేరు ప్రవాహం తగ్గినా అదే పరిస్థితి
- పుట్టగుంట వంతెన వద్ద 23 అడుగులకు చేరిన నీటిమట్టం

బుడమేరు ఉద్ధృతి తగ్గినా దాని పరివాహక గ్రామాలు వరద నీటిలోనే ఉన్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు దిగువనకు వెళ్లేందుకు బుడమేరు ఆక్రమణలు అడ్డుపడుతున్నాయి. దీంతో నీటి ప్రవాహానికి అవరోధాలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు పలు చానల్స్‌లో గుర్రపు డెక్కను తొలగించకపోవడంతో వరద నీరు ముందుకు సాగడం లేదు. దీంతో ఇప్పటికీ పలు గ్రామాల్లోని గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.


తుమ్మలపల్లి ఎస్సీ కాలనీలోని ఇళ్లల్లోకి చేరిన వరదనీరు

గుడివాడరూరల్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుడమేరు ప్రవాహం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. పుట్టగుంట వంతెన వద్ద నీటి మట్టం ఒక అడుగు తగ్గి 23 అడుగుల వద్దకు చేరింది. వంతెనపై మాత్రం నాలుగు అడుగుల మేర వరద నీరు నిలిచిపోవడంతో 11వ రోజు అధికారులు వాహన రాకపోకలను నిలిపివేశారు. బుడమేరు పరివాహక గ్రామాలైన చినలింగాల, పెదలింగాల, పుట్టగుంట, అరిపిరాల, ఒద్దులమెరక, చేదుర్తిపాడు, ఎల్ఎన్‌పురం, రామాపురం, కుదరవల్లి గ్రామాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. బుడమేరు ప్రవాహం తగ్గుతున్నా ఎగువ నుంచి వస్తున్న వరద నీరు దిగువకు వెళ్లేందుకు బుడమేరు ఆక్రమణలు అడ్డుపడటంతో నీటి ప్రవాహానికి అవరోధాలు ఏర్పడుతున్నాయి. అరిపిరాల వద్ద బుడమేరులో ఒక టీడీపీ నాయకుడు అక్రమంగా వేసిన పామాయిల్ తోట, ఫ్యాక్టరీ నిర్మాణం వలన నీరు దిగువనకు వెళ్లకుండా ఎగదన్ని డ్రెయిన్ కరకట్టకు ప్రమాదం కలిగిస్తుందని స్వయంగా అధికార పార్టీ నాయకులే ఆరోపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కుదరవల్లి నుంచి ఎల్ఎన్‌పురం వరకు బుడమేరులో కొణికి, వడ్డేగూడెం గ్రామాల పరిధిలో వందల సంఖ్యలో చేపల చెరువులు తవ్వడం వలన ప్రస్తుతం చెరువులు నీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. ఆక్రమణల కారణంగా నీటి ప్రవాహం సవ్యంగా సాగక పరిసర ప్రాంతాల్లోని రామాపురం, అరిపిరాల, ఎల్ఎన్‌పురం, కుదరవల్లి, పెదవిరివాడ గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. బుడమేరుకు తోడు చంద్రయ్య డ్రెయిన్, దోసపాడు, గుడివాడ, మోటూరు చానళ్లు సైతం కరకట్టలను దాటి ప్రవహించి గ్రామాలను ముంచెత్తడంతో నందివాడ, వెన్ననపూడి, తుమ్మలపల్లి, రుద్రపాక, పోలుకొండ, శంకరపాడు గ్రామాలు, రోడ్లు నీటిలో మునిగి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


కాలువగా మారిన కుదరవల్లి-ఇలపర్రు ఆర్అండ్‌బీ రోడ్డు

గుర్రపుడెక్కను పట్టించుకోని అధికారులు

మేజర్ చానల్ అయిన దోసపాడు, గుడివాడ పరిధిలోని మినీ చానల్స్‌లో గుర్రపుడెక్క, తూడు మేట వేశాయి. అధికారులు ఎవరూ పూడికతీతపై దృష్టి పెట్టకపోవడంతో ముంపు సమస్య వచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బుడమేరు పరివాహక ప్రాంతాల్లో సాగు చేసిన పంటలపై రైతన్నలు ఆశలు వదులుకుంటున్నారు. వరద ప్రభావం వలన ఇప్పటికి 11 రోజులుగా పంట మునిగి నీటిలోనే ఉంది. దీంతో నీరు బయటకు వెళ్లే అవకాశం ఇప్పట్లో లేదు. నీళ్లు వెళ్లి పంట బయట పడినా ఎందుకూ పనికి రాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి అయినా నష్ట పరిహారంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.


పుట్టగుంట వద్ద ప్రవహిస్తున్న బుడమేరు


తుమ్మలపల్లి వద్ద దోసపాడు చానల్లో మేటవేసిన గుర్రపుడెక్క, తూడు

క్లుప్తంగా

మోటార్ ఏర్పాటుకు భూమిపూజ



పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో సబ్ మెర్సబుల్ మోటారు పాడైపోయి విద్యార్థులకు నీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయమై హెచ్ఎం ఇంద్రాణి ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ తెలియజేశారు. ఆయన వెంటనే స్పందించి మోటారు ఏర్పాటుకు మండల పరిషత్ 15 ఫైనాన్స్ నిధుల నుంచి రూ.3 లక్షలను మంజూరు చేశారు. మంగళవారం హైస్కూల్లో మోటారు ఏర్పాటుకు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, పామర్రు ఎంఈఓ-2 పద్మవాణి, పాల్గొన్నారు.

బాధితులకు అందజేసే భోజనంపై ఆరా



గుడ్లవల్లేరు: వరదలతో సరైన గూడు లేక బాధపడుతున్న పోల్‌రాజ్, బంటుమిల్లి కాల్వల మధ్య నివాసం ఉండే బాధితులకు కౌతవరంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గ పరిశీలించారు. బాధితులకు అందుతున్న ఫలహారాలు, భోజనాలపై ఆమె ఆరా తీశారు. ఆమె వెంట ఆర్ఐ షకీలాబేగం, వీఆర్వోలు మల్లికార్జునరావు, రామ్మూర్తి ఉన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి, స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి అభిషేకాలు నిర్వహించారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రావు



తోట్లవల్లూరు: పీసీసీ ప్రధానకార్యదర్శిగా మొవ్వా మోహనరావు నియమితులయ్యారు. తోట్లవల్లూరు మండలం పెనమకూరు గ్రామానికి చెందిన ఆయన గతంలో ఎంపీపీగా పని చేయటంతోపాటు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి కాంగ్రెస్ పార్టీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు పదవులు నిర్వహించారు. తనపై విశ్వాసంతో ఈ పదవిలో నియమించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు మొవ్వా కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య కార్యవర్గం ఎన్నిక

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య మండలం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ వైస్ ప్రెసిడెంట్ వేల్పూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా బొగ్గవరపు బాపూజీ, గౌరవ సలహాదారుడుగా దొరడ్ల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొత్త శ్రీనివాసరావు, కోశాధికారిగా కనమర్లపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా వెంకటరమణారావు, సత్యప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటాం



ముదినేపల్లి రూరల్: భారీ వర్షాల కారణంగా పైర్లు దెబ్బ తిన్న రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని వణుదుర్రు, ఊటుకూరు, విరావిగుంట, బొమ్మినంపాడు గ్రామాల్లో ముంపు బారిన పడ్డ పొలాలను మంగళవారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. భారీ వర్షాలతో పైర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, డ్రెయిన్లు సక్రమంగా ప్రవహించకపోవడంతో ముంపు నీరు బయటకు వెళ్లక పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నట్లు రైతులు ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మండలంలోని కూటమి నాయకులు ఉన్నారు.

పాస్టర్ లాజర్ మృతి

ముదినేపల్లి రూరల్: మండలంలో సీనియర్ పాస్టర్‌గా పేరున్న యడ్ల లాజర్ (70) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందారు. లాజర్‌కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లాజర్ భార్య గతంలోనే మరణించింది. మండలంలోని పలు గ్రామాల నుంచి విశ్వాసులు వచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

నష్టపోయిన రైతులందరికీ న్యాయం


రామనపూడి వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని తటివర్రు, రామనపూడి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ, ఎంపీడీఓ వెంకటరమణ, వ్యవసాయశాఖ ఏఓ బి.అనంతలక్ష్మి, ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసటగా నిలవాలి

నందివాడ: వరదలతో నష్టపోయిన రైతులు, ప్రజలకు అందరూ బాసటగా నిలవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నందివాడ, గుడివాడల్లో ఉన్న పునరావాస కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. బాధితులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల వల్ల లక్షలదిమంది నష్టపోయారని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వంతో పాటు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు బాసటగా నిలిచి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. బుధవారం నందివాడలో పర్యటించనున్న కేంద్ర బృందం దృష్టికి ప్రజలు, రైతుల కష్టాలను తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, డీటీ మల్లిక, ఆర్ఐ గణేష్, ఎస్ఐలు కె.శ్రీనివాసరావు, ఎస్.చంటిబాబు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముదినేపల్లి రూరల్: స్థానిక ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మిగిలిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లలో ఖాళీలున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నంబర్ 90006 20922లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి సామూహిక ధ్యానం

గుడివాడ టౌన్: శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సామూహిక ధ్యాన శిక్షణ ఉంటుందని ధ్యాన కేంద్ర నిర్వాహకురాలు రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ శిక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం ఆరు నుంచి ఏడు గంటల వరకు ఈ ధ్యానం కొనసాగుతుందని తెలిపారు.

వరిగడ్డి తరలింపు



పెదపారుపూడి: పెదపారుపూడి గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వరిగడ్డిని సేకరించి మంగళవారం ట్రాక్టర్‌పై విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ ముంపుబారిన పడి విజయవాడ చుట్టు పక్కల గ్రామాలు చాలా వరకు నీట మునిగిపోయాయన్నారు. దీంతో పశువులకు మేత లేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. యూత్ ఆధ్వర్యంలో వరిగడ్డిని రైతుల వద్ద సేకరించి వరద బాధితల పశువులకు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆరు తాటాకు పాకలు దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం


అగ్నికి ఆహుతైన తాటాకు పాకలు

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు చెందిన ఆరు తాటాకు పాకలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గ్యాస్ బండ పేలడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. మొవ్వ, పామర్రు గ్రామాలకు చెందిన ఫైర్ ఇంజిన్ వాహనాలు విజయవాడకు వెళ్లడంతో మచిలీపట్నం ఫైర్ అధికారులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. బాధితులకు రెవెన్యూ అధికారులు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

ఎయిర్‌పోర్ట్‌లో ముష్టి యుద్ధానికి దిగిన ఆటో డ్రైవర్లు


ఎయిర్‌పోర్ట్‌లో కొట్టుకుంటున్న ఆటో డ్రైవర్లు

గన్నవరం: విమానాశ్రయంలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లే విషయమై ఆటో డ్రైవర్లు ఘర్షణకు దిగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. విమానాశ్రయంలో క్యాబ్ సర్వీస్‌లకు సంబంధించి కాంట్రాక్ట్ ఇటీవల ముగిసింది. దీంతో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేందుకు ప్రైవేట్ కార్లు, ఆటో డ్రైవర్లు లోపలికి ప్రవేశించి ప్రయాణికుల కోసం పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులను ఎక్కించుకునే విషయమై ఇద్దరి ఆటో డ్రైవర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వీరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ ఆవరణలోనే ముష్టి యుద్ధానికి దిగడంతో డ్రైవర్లకు గాయాలయ్యాయి. తోటి డ్రైవర్లు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. అయితే విమానాశ్రయంలో క్యాబ్, ఆటో డ్రైవర్ల మధ్య వివాదాలు పరిపాటిగా మారాయని ఎయిర్‌పోర్ట్ సిబ్బంది పేర్కొంటున్నారు.

పద్మలతకు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందజేత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఫార్మసీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు సాధించారు. విద్యారంగంలో పద్మలత అందించిన సేవలను గుర్తించిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్(సీఎస్సీ) ఆన్‌లైన్‌లో ఈ అవార్డును అందజేశారు. విద్యార్థినులు, వారి జీవిత ఆశయాలను నెరవేర్చేందుకు పద్మలత చేసిన కృషిని సీఎస్సీ బృందం అభినందించింది. ఈ సందర్భంగా పద్మలతకు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

ముంపునకు శాశ్వత పరిష్కారం

కలిదిండి(కైకలూరు): కొల్లేరు ముంపు సమస్యతో పాటు, కైకలూరు నియోజకవర్గంలో డ్రెయిన్ల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కలిదిండి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్నా ప్రధాన మేజర్ డ్రెయిన్ లాల్వ, ఉప్పుటేరు వద్ద ప్రవాహ వేగాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు.

పశువులకు 25,000 కేజీల మేత సరఫరా

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కొల్లేరు గ్రామాల్లో 25,000 పశువుల దానాను బలే ఏసురాజు ఆధ్వర్యంలో మంగళవారం సరఫరా చేశారు.

గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు

కలిదిండి(కైకలూరు): ప్రతి ఏడాది కొల్లేరులో తూడు, గుర్రపు డెక్క, కిక్కిసను తొలగించడానికి రైతులందరూ కలిసి పంటిని ఏర్పాటు చేసే ఆలోచన తీసుకొచ్చిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు అండగా ఉంటామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అన్నారు. తాడినాడ గ్రామంలో చేపల రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకట్రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యే మంగళవారం హాజరయ్యారు. కామినేని మాట్లాడుతూ ఈ నెల 12,13 తేదీల్లో కైకలూరు ట్రావెల్స్ బంగ్లా వద్ద విజయవాడ వరద బాధితులకు అందించేందుకు సేకరిస్తున్న విరాళాలకు సాయం అందించాలని కోరారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు


ముదినేపల్లి మండలం పెయ్యేరు కాలనీలో విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న ఎంపీపీ


గుడివాడలో శ్రీ వీరగణపతిగా గణనాథుడు


పామర్రు కూర్మాపురంలో పూజలు అందుకుంటున్న విష్ణు గణపతి

పామర్రు: గణపతి నవరాత్రుల్లో భాగంగా అనేక చోట్ల వినాయక చలువ పందిళ్లలో మంగళవారం నాల్గోరోజు విఘ్నేశ్వరునికి విశేష పూజలను నిర్వహించారు. స్థానిక తోట, బందరురోడ్డులో, చలపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలోని గణనాథులకు ప్రత్యేక పూజు చేశారు. గ్రామ పరిధిలోని కూర్మాపురంలోని చలువ పందిరిలో ఏర్పాటు చేసిన విష్ణు గణపతికి స్థానికులు విశేష పూజలను చేశారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పెయ్యేరు కాలనీ చిగురుకోట, నరసన్నపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉత్సవాలను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలను చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు జాస్తి చంటిబాబు, ముక్కు వెంకటేశ్వరరావు, సాక్షి సాయిబాబు, అమలేశ్వరరావు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామి వారిని శ్రీ వీర గణపతిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

పంట పొలాల పునరుద్ధరణకు సూచనలు పాటించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు


దెబ్బతిన్న వరిపైరును శాస్త్రవేత్తలకు చూపుతున్న రైతులు

గుడివాడరూరల్: భారీ వర్షాలో ముంపునకు గురైన పంట పొలాలను పునరుద్ధరించుకునేందుకు రైతులు పలు సూచనలు పాటించాలని ఉయ్యూరు చెరకు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని దొండపాడు, మోటూరు, రామనపూడి, తటివర్రు, బొమ్ములూరు తదితర గ్రామాల్లో పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పంట పిలకవేసే దశ నుంచి పొట్ట దశలో ఉందన్నారు. సాధారాణ వరి రకాలు నాలుగు నుంచి ఐదు రోజుల వరకు నీటిలో మునిగితే బతికే అవకాశం ఉందన్నారు. ఈ దశలో వరిపంటలో అధిక నీరు బయటకు పంపిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను వాడకూడదని పేర్కొన్నారు. ఇలా పంట ఉన్న సమయంలో బ్యాక్టీరియా ఎండి ఆకు తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ తెగులు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుందని లక్షణాలను గమనించగానే పొలాల్లో రెండు నుంచి మూడుసార్లు పాత నీరు తీసివేసి కొత్త నీరు పెట్టాలన్నారు. పొటాష్ ఎరువులు ఎకరాకు 20 కిలోలు చొప్పున వేసుకోవాలని, ఇలా వేయడం వలన మొక్కకు వ్యాధి నిరోధక శక్తి తెగుళ్ల ఆశించే అవకాశం ఉండబోదన్నారు. పాముపొడ తెగులు ఆశిస్తే వెంటనే పోపికోనజోల్ 1.0 మిల్లీలీటర్లు, లేదా హెక్సకోనజోల్ 2.0 మిల్లీలీటర్ల నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అనంతలక్ష్మి, శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం


గుడివాడలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న శ్రీరాజబాబు తదితరులు


పెదపారుపూడిలో బాధితులకు భోజనం పెడుతున్న లక్ష్మీనారయణ

గుడివాడ టౌన్: పునరావాస కేంద్రాల్లో వరద బాధితులను దాతలు ఆదుకుంటున్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల, బైపాస్ రోడ్‌లోని సజ్జా బర్నబాస్ కాంపౌండ్‌లో బాధితులకు పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆపన్నహస్తం అందజేస్తున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో ఐదు రోజులుగా బాధితులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు ఏర్పాటు చేసి గుడివాడ, నందివాడ, రూరల్ మండల ముంపు గ్రామాలకు అందజేశారు. ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నందివాడ ఆధ్వర్యంలో స్థానిక వరద బాధితులకు చాపలు, దుప్పట్లు, బక్కెట్లు, మగ్గులు తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సజ్జా బర్నబాస్ పునరావాస శిబిరంలో బాధితులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ వారి ఆధ్వర్యంలో రూ. 25 వేలు భోజన వసతికి అందజేశారు. సంస్థ సభ్యులు బొప్పన రామారావు-అనసూయ దంపతులు ఈ వితరణ అందజేసినట్లు జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: పెదపారుపూడి హైస్కూల్లో బుడమేరు ముంపు బాధితులకు మంగళవారం బీజేపీ నాయకులు భోజనం ఏర్పాటు చేశారు. మచిలీపట్నం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ సూరే లక్ష్మీనారయణ(గాంధీ) మాట్లాడుతూ వన్నేరు, బుడమేరు వలన ముంపునకు గురైన మోపర్రు గ్రామస్తులకు సుమారు 200 మందికి పార్టీ తరఫున భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు దొండపాటి శివాజీ, అశోక్ పాల్గొన్నారు.

అన్నదానం

గుడివాడరూరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నందివాడ మండలంలోని పెదలింగాల గ్రామ రైతుభరోసా కేంద్రం, సచివాలయంలో ఉంటున్న వరద బాధితులకు బొప్పన రామారావు, అనసూయవతి దంపతులు భోజనం ఏర్పాట్లు చేశారు. మానవతా సంస్థ చైర్మన్ వేణుగోపాలరావు, సర్పంచ్‌ల సంఘం డివిజన్ అధ్యక్షుడు కాకరాల సుభాష్‌చంద్రబోస్(సురేష్) అన్నదానం చేశారు.

వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: చోడవరం గ్రామంలో వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు చోడవరం రామాలయం సమీపంలో డి.శివరామకృష్ణ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గత ఆదివారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉంటున్న వి.రవితేజ అనే వ్యక్తి శివరామకృష్ణ ఇంట్లోకి ప్రవేశించి నిద్రపోతున్న శివరామకృష్ణ భార్యపై అసభ్యకరంగా ప్రవర్తించగా, ఆమె కేకలు వేసింది. దీంతో శిరామకృష్ణ నిద్ర లేచి రవితేజను పట్టుకునే యత్నం చేయగా అతడు పారిపోయాడు. ఈ ఘటనపై శివరామకృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.